సార్వభౌమ సత్కారం

1

ఆనాటి అపరాహ్ణవేళ విక్రమాదిత్య చక్రవర్తి ఆస్థానం అంతా ఆనందడోలికలలో ఉయ్యాల లూగిపోయింది! చక్రవర్తికి కది లేక లేక కలిగిన సంతానం! అందులోనూ మగశిశువు! ఇక ఆ పసికందే సార్వభౌముని అనంతరం సామ్రాజ్యభారం వహింపబోతున్నాడు! అందువల్ల చక్రవర్తికేకాక సామ్రాజ్యానికంతటికీ మహోత్సవమే! ఇక రాజధాని ఉజ్జయినీనగరమూ, రాజాస్థానమూ ఈ మహోత్సాహంలో తలమునకలైపోవడంలో ఆశ్చర్యం ఏమి ఉంది!

ఆనాటి నిండుపేరోలగంలో చక్రవర్తి విద్వాంసులకు, కవులకు, గాయనీ నర్తకీమణులకూ రత్నాంగుళీయకాలు, అమూల్యములైన చీని చీనాంబరాలు, అగ్రహారాలూ కోకొల్లలుగా బహూకరించాడు! ఈ బహూకృతి జరిగిన పిమ్మట సార్వభౌముడు విద్వాంసుల నందరినీ శిశువు జాతకచక్రం పరిశీలించి ఫలితాలు చెప్పవలసిందని ప్రార్థించాడు. విక్రమాదిత్యుడంతటి విద్వత్ప్రభువు 'ప్రార్థన' కంటె విద్వాంసుల కిక వేరే ఏమి కావాలి గనక! అందరూ తమతమ హస్తాల్లో ఉన్న ఆ శిశువు జాతకం పరిశీలనలో మునిగిపోయారు! అవి భూర్జపత్రాలమీద లాక్షారసంతో లిఖించిన జన్మపత్రికలు. పండితులేకాక చక్రవర్తికూడా

స్వయంగా జాతకం పరిశీలిస్తున్నాడు! ఆస్థాన జ్యోతిర్విద్వాంసుడు ఆదిత్యభట్టారకుడు వేళ్లు మడిచి మీనమేషాలు లెక్కపెడుతూ మధ్య మధ్యన చక్రవర్తి ముఖకవళిక లోకకంట కనిపెట్టి చూస్తున్నాడు.

మధ్యాహ్నం మూడుయామూలు గడిచిపోయాయి. దానికి సూచనగా రాజప్రాసాదం గోపురంమీద గంభీరంగా భేరీధ్వనులు మారుమోగాయి. కొంతసేపటికి ఆ సమీపంలో మహాకాళనాథుని దేవాలయం గంటల గణగణలు వినిపించాయి. తరువాత "హర! హర! మహాదేవశంభో! జయ! మహాకాళనాథా! జయ!" ఇత్యాది జయజయధ్వానా లా గంటల గణగణలలో కొంచెం అస్పష్టంగా వినిపించాయి.

చక్రవర్తి కిరువైపులా ఒయ్యారంగా నిలిచిన చామరగ్రాహిణులు వింజామరాలు వీస్తున్నారు. వారిద్దరికీ కొంచెం వెనక తాంబూల కరండకం బుజంమీద ధరించిన మరి ఒక సుందరి చిత్రప్రతిమలా నిలబడి, విద్వాంసు లెవరికైనా కర్పూర తాంబూలాల అవసరం కలగగల దేమోనని రెప్ప వెయ్యకుండా నిరీక్షిస్తున్నది. గవాక్షాలద్వారా ప్రసరిస్తున్న ఎండపొడలు రాజసభలో పరిచిన రత్నకంబళ్ళమీద పడి వింత వింత రంగులు వెదజల్లుతున్నాయి. అప్పుడప్పుడా కిరణాలుపడి అటు ఇటు కదులుతున్న తాంబూల కరండక వాహిని పైడికుండలాలు తళతళ మెరుస్తున్నాయి. పక్కగా ప్రవహిస్తున్న శిప్రానది తరంగాల రొద ఉజ్జయినీనగరం ఉత్సవ కోలాహలాని కొక మంద్రశ్రుతిగా వినవస్తున్నది.

కొంతవరకు జాతకపరిశీలన జరిగిన తరవాత చక్రవర్తి చూపు లాస్థాన జ్యోతిషికునిమీద పడ్డాయి. ఆ విద్వాంసుడు వెంటనే లేచి నిలబడి సవినయంగా చేతులుజోడించి కొంచెం సంకోచిస్తూ—

"మహాప్రభూ! నా దొక్క మనవి! మొదటినించిన్నీ ముఖస్తుతి చేస్తాననే అపప్రథ ఒకటి నామీద పడిఉన్నది! ఇందువల్ల నా కేమన డానికిన్నీ పాలుపోవడం లేదు!" అన్నాడు.

చక్రవర్తి పెదిమలపై ఒక చిన్న చిరునవ్వు చిందులు దొక్కింది! "ఆ సంకోచ మేమీ ఉండనక్కరలేదు! యథేచ్ఛగా మాట్లాడవచ్చు"

అని ఆ చిరునవ్వుల పరమార్థం. జ్యోతిషివడా పైన జాతకచక్ర ఫలితం ఇలా విన్నవించుకొంటున్నాడు:

"సార్వభౌమా! రత్నాల గనిలో గులకరాయి బయలుదేరదు గదా! జాతకం పరిశీలిస్తూంటే 'ఆ దేవేంద్రుడే విలాసార్థమై ఈ ఉజ్జయినిలో అవతరించాడా!' అన్నట్టుగా ఉంది! భాగ్య రాజ్యాధిపతులు పరమోచ్చస్థులై ఉన్న శుభసమయంలో యువమహాసార్వభౌము లవతరించారు! ఆపైన బలమైన శుభగ్రహ వీక్షణంకూడా తోడైంది! ఇక వేరుగా విన్నవించవలసిం దేమున్నది! మహాప్రభూ! జాతకుడు చతుస్సముద్ర వేలావలయిత భూమండలాని కంతటికీ ఏకచ్ఛత్రాధిపత్యం వహించి, తన ప్రతాపంకూడా కొంచెం కించపరచ గలడనే అనిపించింది!"

అని చక్రవర్తి ముఖంవైపూ, మిగిలిన సభ్యుల ముఖాలవైపూ చూస్తూ నెమ్మదిగా తన ఉన్నతాసనంమీద ఆసీనుడైనాడు.

చక్రవర్తీ, మిగిలిన సదస్యులూ ఈ శుభ ఫలితాని కెంతో ఆనందించారు. పిమ్మట విక్రమాదిత్యుని కటాక్షవీక్షణం మిహిర పండితుని మీదికి తిరిగింది.

అతడు అత్యంత భయభక్తులతో లేచి నిలుచుని—

"ప్రభూ! నే నెప్పుడూ అశుభ ఫలితాలే చెబుతాననే అపకీర్తి పొందిఉన్నవాణ్ణి! ఈ శుభసమయంలో నా వంటి శకునపక్షి ప్రసంగం సముచితంకాదు. నన్ను మన్నించండి!" అని వెంటనే కూర్చోబోయాడు. కాని చక్రవర్తి దాని కనుమతించలేదు. అందుచేత మిహిర పండితుడు తిరిగి సవినయంగా శిరస్సువంచి—

"జాతకం స్థూలదృష్టికి ఆస్థాన విద్వాంసులు చెప్పినట్లుగానే కనిపిస్తున్నది. కాని ప్రబలమైన బాలారిష్టదోషం ఒకటి పట్టి ఉంది. అది ఉంటే ఎన్ని మహా రాజయోగాలు పట్టినా-అవి ఏమీ ఫలించవు!" అని ముక్తసరిగా మూడు వాక్యాలలో తన ప్రసంగం ముగించివేసి కూర్చున్నాడు. దీనితో జాతక పత్రికలు పరిశీలిస్తున్న మిగిలినవారందరి మీదా ఒక పెద్ద పిడుగు పడ్డట్టయింది! ఆస్థాన జ్యోతిర్విద్వాంసుని కళ్ళు

క్షేపురించాయి! చక్రవర్తి తొణకా లేదు, బెణకాలేదు! ఆస్థాన విద్వాంసుడు మరి చక్రవర్తి కనుసన్న కోసం వేచిఉండలేక చరుగ్గన లేచి నిలుచున్నాడు! కాని దానికి విక్రమాదిత్యుని అంగీకార ముద్ర పడలేదు! ఇక చేసేదేమీ లేక నిలుచున్న పళంగానే తన స్థానంలో చతికిలబడిపోయాడు.

మిగిలిన విద్వాంసులంతా ఇక ముందు క్షణంలో ఏమి జరగనున్నదో అన్నంత ఆత్రంతో చక్రవర్తి కనుసన్నలు నిరీక్షిస్తూ ఉద్విగ్నంగా వేచిఉన్నారు.

"ఇంతకీ ఘటకర్పర కవీశ్వరు లేమంటారో!" అన్నాడు విక్రమాదిత్యుడు. అందరూ ఆశ్చర్యపోయారు! ఘటకర్పర కవికి జ్యోతిష శాస్త్రంలో ఉన్నది కేవలం శ్రుతపాండిత్యమే.

ఘటకర్పరకవికూడా ఈ చర్చలో తన ప్రసక్తి రాగలదని అనుకో లేదు! అయినా ప్రభువు ఆజ్ఞ అయిన తరవాత మరి మాట్లాడకపోతే బాగుండదనుకొని కంగారుగా లేచి ఇలా విన్నవించాడు:

"నాది శ్రుతపాండిత్యమే నన్నది ప్రభువువారికి తెలియని విషయం కాదు! కేవలం వినోదార్థమే నన్నీవిధంగా ఆజ్ఞాపించి ఉంటారనే అనుకుంటున్నాను. అయితే— ఇన్నాళ్ళనించీ కవితా వధూమణి ఒక్క కవుల సొమ్మేనని భావించేవాణ్ణి! ఈనాడీ విద్వాంసుల ప్రసంగా లాలకించిన తరవాత— ఇక ఆ వధూమణి జ్యోతిష విద్వాంసుల కైవసమైపోయిందని తోచింది! ఇకనించీ నేనీ కవితా పరిశ్రమ విరమించుకొని నాలుగు జాతక చక్రాలు గుణించుకుంటూ కూర్చుంటే జీవితం సుఖంగా వెళ్ళిపోతుందని భావిస్తున్నాను. ఈవేళ వీరి ప్రసంగాలు విని బ్రహ్మానందభరితుణ్ణయినాను."

సభాస్తారులంతా స్థూలంగా కవిచమత్కృతి గ్రహించి కలకల నవ్వారు! చక్రవర్తి కవి వాక్కులోని లోలోపలి వ్యంగ్యాలు, ఈసడింపులు గ్రహించి గుంభనగా ఒకనవ్వు నవ్వి, వెంటనే ఆకవి పక్కనే సుఖాసీనుడై ఉన్న న్యాయశాస్త్ర విద్వాంసుడు భేతాళభట్టు వైపు తిలకించాడు. ఆయన తర్కశాస్త్రంలో నిధి. చక్రవర్తికి ప్రత్యే

శాభిమానం ఉన్నశాస్త్రం కనక జ్యోతిషంలోకూడా బాగా పరిశ్రమ చేశాడు. భేతాళభట్టు దిగ్గునలేచి చక్రవర్తి కిలా విజ్ఞాపన చేసు కొన్నాడు :

"మహారాజా! ఏలినవారొక్క విషయం సావధానంగా దివ్య చిత్తానికి హత్తించుకోవాలని విన్నవించుకొంటున్నాను. ఆస్థాన జ్యోతిష విద్వాంసులైన ఆదిత్యభట్టారకులు ఆర్ష జ్యోతిషంలోను, లౌకిక జ్యోతి షంలోను దిగ్గంతులు! తమ సువిశాల సామ్రాజ్యంలో వారికి సాటి రాగల మేటివిద్వాంసు లెవ్వరూ లేరు. వారివాక్కు సాక్షాత్తు వేదవాక్కే. ఇక మిహిరపండితులమాట! వీరికీర్తి దిగ్దిగంతాలవరకు వ్యాపించింది గదా! పశ్చిమదేశాలనించి వచ్చిన యవనవిద్వాంసులుకూడా వీరి పాద సన్నిధిని ఈ శాస్త్రం అభ్యసిస్తున్నారంటే ఇక వీరి ఘనతవిషయం నేను వేరుగా విన్నవించవలసింది ఏమి ఉంది! పైగా వీరు యవనశాస్త్ర వేత్తల అపూర్వ రహస్యాలుకూడా కూలంకషంగా అవగాహన చేసు కొన్న వారాయెను! వీరిద్దరిలోను మనం ఎవరిని కాదనగలం! అయితే ఈ ఇద్దరూ యువసార్వభౌముల జాతకం కూలంకషంగా అవలోడనచేసి కేవలం పరస్పర విరుద్ధమైన ఫలితాలు సెలవిచ్చారు. ఈ శాస్త్రానికి వీరిద్దరూ సూర్యచంద్రుల వంటివారుగదా!...... ఆలోచించగా- ఆలో చించగా నాకు జ్యోతిశ్శాస్త్రంలోనే ఏదో గొప్ప లోపం ఉన్నట్టు భాసిస్తూంది. అసలీ శాస్త్రం తర్కవ్యాకరణాది శాస్త్రాల సరసన కూర్చోబెట్టడానికి తగినశాస్త్రమే కాదని నా అనుమానం. ఈమధ్యన ఈశాస్త్రం లోతులు కొంచెం ఆకళించుకొన్న తరవాత నావంటి అల్పు డికి తోచిన అభిప్రాయం ఇది. ఆపైన మరి దేవరవారి చిత్తం!"

ప్రసంగా లీవిధంగా పాకంలోపడ్డ తరవాత ఆస్థాన విదూషకుని కిక ఉండబట్టలేదు. చక్రవర్తి సెలవులేకుండానే అదరా బాదరాగా అర్ధకుసిగా లేచి నుంచుని తనఘోష వెళ్ళబోసుకున్నాడు.

"భూలోక దేవేంద్రా! స్వయంగా శాస్త్రవేత్తలై ఉండీన్నీ తర్కపండితులు జ్యోతిషంవంటి మహాశాస్త్రమే "సర్వం మిథ్య" అని కొట్టిపారేశారు. నిజానికన్నిశాస్త్రాలూ అంతే. కనకనే చిన్ననాడే నేను శాస్త్రాభ్యాసానికి స్వస్తిచెప్పి హాయిగా అగమ్మకాకిలా తిరిగాను.

ఈ విజ్ఞానం యావత్తూ నాకు బాగా పసిప్రాయంలోనే అబ్బింది. ఏలిన వారు నన్ను పట్టి హాస్యగాడని కొట్టిపారేసారుగాని, ఈ మహాసానంలో విద్వద్బిరుదం ఇచ్చి గౌరవింపదగినవాణ్ణి నేనొక్కణ్ణేనని నాకిప్పుడు గట్టి ధీమా కలిగింది.''

విదూషకుని ప్రసంగం ముగిసేసరికి ఆసానం అంతా ఒక్కసారిగా విరగబడి నవ్వింది! గభీరముద్ర వహించిన చక్రవర్తికూడా నవ్వకుండా ఉండలేకపోయాడు. చివరికి తాంబూల కరండక గ్రాహిణి, చామర గ్రాహిణులుకూడా తమ సహజవినయం విడిచివేసి కలకల హాసాలు చిలకరించారు.

కాని జ్యోతిషవిద్వాంసు లిద్దరూ ఈ అవహేళన కేమీ చెయ్యలేక వెలవెలబోయారు! మిహిర పండితుడు మాత్రం లేని చిరునవ్వు తెచ్చి పెట్టుకున్నాడు. ఆదిత్య భట్టారకుడు మిహిర పండితుడు మాట్లాడినప్పటి నుంచీ లోలోపల ఉట్టుడికిపోతున్నట్టుడికి పోతూనే ఉన్నాడు! విదూషకుని ప్రసంగంతో అతనికి అరికాలిమంట నెత్తికెక్కింది. ఒక్కసారిగా దూసిన కత్తిలా లేచి నిలబడి—''మహాప్రభూ! తమరు ధర్మప్రభువులై ఉండీన్నీ వేదాంగమైన జ్యోతిశ్శాస్త్రానికీ విధంగా అపచారం జరుగుతూంటే సహించి ఊరుకోవడం న్యాయంకాదు. నా విజ్ఞప్తికి కూడా కొంచెం అవకాశం ఇప్పించవలసిందని వేడుకొంటున్నాను.'' అన్నాడు.

దీనితో సభలోనివారంతా ఒక్కసారిగా శిలాప్రతిమల్లా నిర్ఘాంతపోయారు. చనువిచ్చినంతమాత్రాన ముందు వెనకలు చూసుకోకుండా చక్రవర్తిపై ఈ విధంగా నిందమోపడం సభామర్యాద లక్షణం కాదని వారిలో వారు గుసగుస లాడుకున్నారు. కాని చక్రవర్తి అల్లాగే ఉల్లాసంగా నవ్వుతూ ఆదిత్యభట్టారకుని ప్రసంగాని కంగీకరించాడు.

దానితో భట్టారకుని కోపం కొంచెం శాంతించింది. అత డిలా అన్నాడు:

''ఈ యవన సంసర్గం ఏర్పడినప్పటినించీ మన ప్రాచీనార్ష సంప్రదాయాలన్నీ గంగలో కలిసిపోతున్నాయి. తత్రాపి వేదాంగజ్యోతిషం మరీ భ్రష్టమైపోయింది. ఈ విషయం తమ దివ్యచిత్తానికి తేవాలని నేనిన్నాళ్ళనించీ తాపత్రయ పడుతున్నాను. ఇక మా ప్రస్తుత వివాద

విషయం! మిహిర పండితులు యువసార్వభౌముల జన్మపత్రికలో ఏదో అస్పష్టమైన బాలారిష్టదోషం ఉన్నదని ఉట్టంకించి ఉన్నారు! ఈ అస్పష్ట ఫలితాలవల్లనే ఈ శాస్త్రం ఈ విధంగా నవ్వులపాలై పోతున్నది. కనక విస్పష్టంగా ఆ బాలారిష్టం సంభవించే సమయము, ఆ అరిష్ట స్వభావము వివరించవలసిందని వారిని సవినయంగా వేడు కొంటున్నాను!''

మిహిర పండితు డిక ప్రసంగించ దలుచుకోలేదు. ఏదో అస్ప ష్టంగా - ముక్తసరిగా సమాధానం చెప్పవలెనని అనుకున్నాడు. కాని చక్రవర్తి దాని కంగీకరించలేదు. విధిలేక అత డిలా అన్నాడు:

''ఈ మహోత్సవ సమయంలో ఈ విధంగా ప్రసంగించవలసి వచ్చినందుకు ప్రభువులు, సభ్యులు నన్ను మన్నించవలెనని ప్రార్థిస్తున్నాను. నేను యవనవిద్వాంసులచేత ఆర్ష జ్యోతిషం అధ్యయనం చేయించినమాట యథార్థమే. వారివద్ద స్వయంగా కొన్ని శాస్త్ర రహస్యాలు గ్రహించిన మాటా యథార్థమే. కాని అంతమాత్రంచేత ఆర్ష శాస్త్ర సంప్రదాయానికి నేను చేసిన అపచారమేమో నా కవగతం కాలేదు! ఇక నేను చెప్పిన జోస్యంవిషయం మనవి చేస్తున్నాను. ఈ జాతకుని ఆయుర్దాయం మరి రెండు సంవత్సరాలే. మూడవ సంవత్సరం ప్రారంభంలోనే వనవరాహం వల్ల అరిష్టం సంభవించగలదు. అప్రియం చెప్పినందుకు నన్ను మన్నించ వలసిందని తిరిగీ విన్నవించుకొంటున్నాను.''

మిహిర పండితు డీ మాట లనగానే సభలో మళ్ళీ పిడుగు పడ్డట్ల యింది. సభాస్తారులంతా నిర్ఘాంతపోయారు. చక్రవర్తి కేమీ పాలు పోక విచారంగా మౌనముద్ర వహించాడు.

''ఆదిత్య భట్టారకులకు నా దొక్క మనవి'' అన్నాడు విదూష కుడు హఠాత్తుగా లేచి నిలబడి. చక్రవర్తి ప్రశ్నార్థకంగా కనుబొమలు ముడిచాడు.

''మరి యువసార్వభౌముల పట్టాభిషేకం ఏ సంవత్సరంలో జరగ గలదో విస్పష్టంగా తెలియజెయ్యవలసిందని నా ప్రార్థన'' అన్నాడు విదూషకుడు.

భట్టారకుడు ఠీవిగా నిలబడి "సరీగా నేటికి 20 సంవత్సరాల అనంతరం ఈ సభామంటపంలోనే — చక్రవర్తి స్వయంగా యువ మహారాజులుంగారికి సామ్రాజ్యాభిషేకం జరపగలరు! ఇది ముమ్మాటికీ నిశ్చయం! యువసార్వభౌమునికి జయం! జయం!" అన్నాడు.

సభ్యులందరూ ఆనందంతో ఒక్కసారిగా 'జయం! జయం!' అన్నారు. ఆ హర్షధ్వానాలతో సభలో హఠాత్తుగా వర్షం కురిసి వెలిసినట్లయింది.

విదూషకుడు తిరిగి లేచి నిలబడి చక్రవర్తి కెదురుగా దీనంగా ముఖంపెట్టి అతివినయంగా చేతులుకట్టుకుని "ప్రోస్, ఆనాటికైనా నన్ను తమ ఆస్థాన విద్వాంసుణ్ణిగా ఏర్పాటు చేయించవలిసిందని నా ప్రార్థన!" అన్నాడు. సభలో వెంటనే ఉవ్వెత్తుగా కలకలహాసం చెలరేగింది. నాటికి పరిషత్తు ముగిసిపోయింది.

2

ప్రిమ్మట కాలక్రమంలో రెండుసంవత్సరాలు రెండు దివసాలుగా గడిచిపోయాయి. చక్రవర్తి కీజ్యోతిర్విద్యమీద గాఢాభిమానం ఉన్న మాట వాస్తవమే! అయితే గొప్ప గొప్ప విద్వాంసులు చెప్పిన భావి ఫలితాలు కూడా ఒక్కొక్కప్పుడు తప్పిపోతూండడంవల్ల ఆ శాస్త్రం మీద నయితేనేమి - శాస్త్రజ్ఞులమీద నయితేనేమి కొంత కొంత అవిశ్వాసం ఏర్పడినమాట వాస్తవమే!

కాని భవిష్యత్తు విషయంలో తహతహ పడని మహామహులు చాలా అరుదుగా ఉంటారు! అందులోను చక్రవర్తికి లేకలేక కలిగిన కుమారుడు! అతడు సామ్రాజ్యానికంతటికీ ఒకే ఒక వారసుడు! అవధి సమీపించినకొద్దీ- ఎంతగా జ్యోతిశ్శాస్త్రం కాదనుకొన్నా - చక్రవర్తికి లోలోపల కుమారుని భవిష్యత్తు విషయమై కొంచెం భయం ప్రారంభమైనది! ఆదిత్యభట్టారకుడు, మిహిరపండితుడు ఇద్దరూ కొన్ని శాంతిక్రియలవల్ల భావిదుష్ఫలితాలు కొంతవరకు ఉపశమించవచ్చునని అంగీకరించారు! అందువల్ల చక్రవర్తి రాజపురోహితుణ్ణి పిలిపించి-

అనేకమైన అరిష్టశాంతిహోమాలు, దానధర్మాలు, యజ్ఞయాగాలు చేయించవలసిందని ఆజ్ఞాపించాడు. మొట్టమొదట రెండేళ్ళయినా నిండీ నిండని పసిబాలకుని వనవరాహం మూలకంగా మృత్యువు సంభవించగలదంటే ఎవరికీ విశ్వాసం కలగలేదు. చక్రవర్తికి ఈ మాటల్లో ఉన్న ఔచిత్యం గోచరించకపోలేదు! అయినా అంతఃపురం ఉద్యానవనాల పరిసరాలలో ఎక్కడా అడవిపందుల పసికూనలు కూడా కనబడకూడదని గట్టిగా కట్టడిచేశాడు. మొదట అరణ్యాల్లో వనవరాహాల నామరూపాలు లేకుండా రూపుమాపి వెయ్యాలని సంకల్పించాడు గాని— యజ్ఞవరాహమూర్తి ప్రాచీనకాలంనుంచీ చక్రవర్తి వంశీయుల కుల దైవం. వారి పతాక చిహ్నంకూడా యజ్ఞ వరాహమే! అందువల్ల ఆ ప్రయత్నం విరమించి అరణ్యాల్లో వనవరాహాలు సంచరించే ప్రాంతాలకు గట్టి పరిమితులు ఏర్పాటుచేయించాడు. రాజకుమారునికి ఏ విధమైన అపాయమూ సంభవించకుండా అహోరాత్రాలూ కంటికి రెప్పలా కాపాడవలసిందని ఆజ్ఞాపించాడు.

మూడవ సంవత్సరం ప్రారంభంలోనే అరిష్టం సంభవించగలదని మిహిర పండితుడు జోస్యం చెప్పాడుగదా! ఆ ప్రారంభం అంటే ఎంతకాలమో విస్పష్టంగా తేల్చి చెప్పవలసిందని చక్రవర్తి పండితుణ్ణి ప్రశ్నించాడు.

"మహాప్రభూ! మూడో సంవత్సరంలో మొదటి మాసంలోనే ఆ అరిష్టం సంభవింపగలదు."

"శాంతిక్రియలవల్ల ఈ అరిష్టం శాంతించదా?"

"అది కొంతవరకే శాంతిస్తుంది. కాని జాతకుని కంతకంటె ఒక్క క్షణంకూడా ఆయుర్దాయంలేదు!"

"అది ఆ మాసంలో ఏ క్షణంలో జరగగలదో తెలియదా?"

మిహిరుడు కొంచెంసే పాలోచించి, "తెలుసుకోవచ్చును గాని - నా శాస్త్రజ్ఞానం బహు పరిమితం! అదిన్నీగాక గ్రహగతిని బట్టి శాస్త్రజ్ఞులు భవిష్యత్తు సూచనాప్రాయంగానే నిర్ణయిస్తారు. అంతే

గాని అల్పాల్పమైన తారతమ్యాలెవరు నిర్ణయించి చెప్పగలరు! అది తెలిసినవాడా దైవం ఒక్కడే!" అన్నాడు.

ఆ పిమ్మట ఆమూడోమాసంకూడా చాలా వరకు గడచిపోయింది. క్రమంగా వసంతం ముదిరి గ్రీష్మం ప్రారంభమైనది. ఆ మాసావధి సమీపించినకొద్దీ పుత్రప్రేమవల్ల విక్రమార్కుని హృదయంలో భయాందోళన లెక్కువైనాయి. ఆస్థాన జ్యోతిషపండితుడు, అమాత్యులు ఇక ప్రాణాపాయం దాటిపోయినట్లేనని చక్రవర్తికనేక విధాలుగా ధైర్యం చెప్పారు! అయినా చక్రవర్తి హృదయంలో నిత్యమూ అరణ్యవరాహాలు గోండ్రిస్తూన్నట్లే ఉండేది!

మానవ హృదయంలో బీభత్సంగా పెల్లుబికిన భయాందోళనలే ఒక్కొక్కప్పుడు భౌతికరూపాలు ధరిస్తూంటాయి. ఆనాటి రాత్రి గ్రీష్మాధిక్యంవల్ల బాగా ఉక్కపోసింది. చక్రవర్తి రాజప్రాసాదం మీద శిశువుశయ్య కనతిదూరంలోనే హంసతూలికాతల్పంపై పవ్వళించి కలత నిద్రలో ఏదో కలవరించాడు. దిగ్గున లేచి కూర్చున్నాడు. అతనికి అరణ్యవరాహం మేడమీదికి దూకివచ్చి యువసార్వభౌముని హృదయం వాడి కోరలతో చీల్చివేసినట్లు కల వచ్చింది. కాని లేచి చూచిన తరవాత అదంతా భ్రాంతి మాత్రమే అని స్పష్టపడింది.

చక్రవర్తి దైవధ్యానంచేసి తిరిగి పవ్వళించాడు. ఎక్కడా ఆకల్లాడడంలేదు. గాలి స్తంభించింది. నల్లనల్లగా కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఉండి ఉండి హఠాత్తుగా ఝంఝామారుతం వీచింది. ఫెళఫెళధ్వనులతో పిడుగుపడింది. కెవ్వని కేక వినిపించింది. చక్రవర్తి లేచి ఒక్క అంగలో శిశువు శయ్యదగ్గరికి చేరుకున్నాడు. ఎదురుగా రక్తసిక్తమైపోయిన శయ్య! పరిజనులంతా పరుగెత్తుకువచ్చారు. మొదట ఈ ఘోర దారుణానికి కారణమేమో ఎవరికీ తెలియలేదు. కొందరు పిడుగుపడి ఉండవచ్చు ననుకొన్నారు. రాజప్రాసాదంపై ప్రతిష్ఠించిన పతాకంపై నిలిపిన లోహ వరాహమూర్తి వాడి కోరలు శిశువు హృదయం చీల్చివేశాయి. గాలి తాకిడికా పతాకం విరిగి నేలపై ఒరిగి అక్కడే పడిపోయింది. వేగరులు రాజవైద్యుల కోసం పరుగులు పెట్టారు. వారంతా శాయశక్తులా చికిత్సలు చేశారు. కాని విధి బలీయమైపోయింది.

3

ఈ వార్త ఉజ్జయినీ నగరం అంతటా కార్చిచ్చులా వ్యాపించింది. ఈ సంఘటనపై విద్వాంసులు తమలో తామనేక విధాలుగా వాదోపవాదాలు సాగించారు. కొందరు మిహిరుని జోస్యం అక్షరాలా ఫలించిందన్నారు. మరి కొందరది వనవరాహం కాకపోవడం వల్ల జోస్యం పూర్తిగా తప్పిపోయినట్లే అని చప్పరించేశారు.

అటుతరవాత రెండుమూడు నెలలవరకూ చక్రవర్తి ఆస్థానంముఖమే చూడలేదు! సన్నిహితులైన వారెవరికో గాని, చక్రవర్తిదర్శనమే కాలేదు!

ఆదిత్యభట్టారకుడు తన జోస్యం తప్పినా మిహిరుడు చెప్పినట్లు జరగలేదుగదా అని చాలా ఆనందించాడు! ఈ దెబ్బతో అతనికి దేవిడీమన్నా జరిగిపోగలదని లోలోపల చాలా ఉవ్విళ్ళూరాడు. కాని విద్వాంసుల్లో చాలామంది ఆ విధంగానైనా మిహిరుని జోస్యం ఫలించిందికదా అని పరమానంద భరితులైనారు. ఇంతకీ చక్రవర్తి లోలోపలి నిర్ణయమేమో ఎవరికీ అంతుదొరకలేదు. చక్రవర్తిని ఎంతమంది దర్శించినా - ఆయనతో ఆ విషయం ప్రస్తావించడానికే బెదిరిపోయేవారు. అటు చక్రవర్తి, ఇటు మిహిరుడు-ఈ విషయంలో కేవలం ఔదాసీన్యం వహించి ఊరుకున్నారు. అలాగలాగ ఆరు మాసాలు గడిచిపోయాయి.

హఠాత్తుగా విద్వాంసులందరికీ ఆస్థానానికి రావలసిందని ఆహ్వానాలందాయి. అందరూ తిరిగి చక్రవర్తి రాజకార్యాలు పరిశీలిస్తున్నారు గదా అని సంతోషించారు.

విద్వాంసులందరూ పల్లకీ లెక్కి ఆస్థానద్వారం చేరుకునేసరికి ఆస్థానం అంతా నూతనాలంకారాలతో కలకలలాడుతూంది! అందరూ ఆశ్చర్యపోయారు! లోపలికి వెళ్ళి తమతమ సమున్నతాసనాలపై సుఖాసీనులయినారు. చక్రవర్తి చాలా ఉల్లాసంగా ఉన్నాడు; ఆ ముఖంలో ఎక్కడా విషాదచ్ఛాయే కనిపించలేదు. కొంతసేపటికి చక్రవర్తి మిహిరుని సమ్ముఖాని కాహ్వానించాడు. ఆయన మెల్లిగా అడుగులు వేసుకుంటూ చక్రవర్తి సింహాసన సమీపంలో నిలుచున్నాడు.

చక్రవర్తి బంగారు పళ్లెరంలో ఉంచిన నవరత్న ఖచితమైన సువర్ణవరాహం ఆయన కందించబోయాడు. మిహిరుడు తన కన్నులే నమ్మలేకపోయాడు! అటువంటి మహాగౌరవం ఇదివరకెన్నడూ ఆ ఆస్థానంలో జరిగి ఉండలేదు! సదస్యులందరూ క్షణంలో ఇది గ్రహించుకొని జయజయధ్వానాలు చేశారు!

మిహిరుడు సవినయంగా శిరస్సువంచి, ''మహాప్రభూ! దీనికి నేననర్హుణ్ణి! నేనన్నది ఫలించ లేదు! ఒక వేళ ఏదోవిధంగా ఫలించినా దేవరవారి కది శుభఫలితం కాలేదు!'' అన్నాడు.

''శుభాశుభాలతో నిమిత్తంలేదు! మీ వైదుష్యానికీ, వాక్శుద్ధికీ మాత్రమే ఈ సన్మానం. అదీ గాక మీరన్నది అక్షరాలా యథార్థమైనది. వనవరాహమని మీ రన్నారు! అది లోహ ప్రతిమే అయినా వనవరాహమే! అది సజీవమా, నిర్జీవమా అన్న మీమాంస కీ వివాదంలో ప్రసక్తే లేదు!'' అన్నాడు సార్వభౌముడు.

ఇక మిహిరుని కా సన్మానం అంగీకరించక తప్పలేదు.

''మహాప్రభూ! ఇది మీ అపారమైన ఔదార్యానికి మాత్రమే తార్కాణం'' అన్నాడు మిహిరుడు, సువర్ణ వరాహ బహూకృతి స్వీకరిస్తూ.

ఆస్థాన విద్వాంసు లందరూ ముక్త కంఠాలతో తిరిగీ జయ జయ ధ్వానాలు చేశారు.

పిమ్మట చక్రవర్తి సవినయంగా మిహిరునికి నమస్కరించాడు.

''సుపుత్రావాప్తిరస్తు'' అన్నాడు మిహిరుడు చేతులెత్తి.

''ఇది మీ అమోఘాశీర్వచనం'' అన్నాడు చక్రవర్తి.

''ఆశీర్వదించడానికి సమర్థులైన మహనీయులెందరో ఈ ఆస్థానంలో ఉన్నారు. ఆ అర్హత నాకు లేదు. నేను కేవలం తమ జాతకచక్రఫలితం దృష్టితోనే ఈ మాట అన్నాను'' అన్నాడు మిహిరుడు.

ఆస్థాన విద్వాంసుల జయ జయ ధ్వానాలు తిరిగీ ఇంకొకసారి మిన్నందుకొన్నాయి.

ఆ నాటినించీ మిహిరుడు వరాహ మిహిరుడనే విశ్వ విఖ్యాతి సంపాదించుకొన్నాడు.